క్లుప్తంగా...

ధర్మగిరి ఆలయంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

శంషాబాద్: ధర్మగిరి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాకు హారతి, పల్లకీ సేవ, హోమం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. వందల సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు, వ్రతాలు జరిపారు. సుమారు రెండువేలకు పైగా భక్తులకు ఆలయ ట్రస్టీ శివదత్తసాయి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఏరియా ఆస్పత్రిలో బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో ప్రతి శుక్రవారం మహిళలకు బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ ఉచితంగా చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారి తెలిపారు. కన్సల్టేషన్, స్క్రీనింగ్ సౌకర్యం ఉందని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రాథమిక దశలో బ్రెస్ట్ క్యాన్సర్‌ను గుర్తిస్తే వైద్యం అందిస్తామన్నారు.

బస్‌పాస్ కౌంటర్ పనివేళలు

రాయదుర్గం: ఆర్టీసీ బస్ పాస్ కౌంటర్ సమాచారం
- బస్‌పాస్ కౌంటర్ ప్రాంతం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో లింగంపల్లి బస్టాండులో రెండు బస్‌పాస్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయి.
- నిత్యం ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 8.15 గంటల వరకు అన్ని ప్రభుత్వ పని దినాలలో అందుబాటులో ఉంటాయి.
- విద్యార్థులు, సాధారణ పౌరుల బస్‌పాసులు, రెన్యూవల్స్‌ను ఇక్కడ అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

నేడు రూ.2.56 కోట్ల పనులకు శంకుస్థాపన

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. డివిజన్ పరిధిలోని లక్ష్మీవిహార్ కాలనీలో రూ.25 లక్షలతో సీసీరోడ్లు, నానక్‌రాంగూడ ఎస్సీ బస్తీలో రూ.21 లక్షలతో యూజీడీ పనులు, రాయదుర్గంలో రూ.94 లక్షలతో సీసీ రోడ్లు, వినాయక్‌నగర్‌లోరూ.11 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొంటారు.

హెచ్‌సీయూలో వార్షిక డిస్‌ప్లే..

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఎస్ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో వార్షిక డిస్‌ప్లే-2023 కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఎంఎఫ్ఏ ప్రోగ్రామ్ అవుట్‌గోయింగ్ బ్యాచ్ విద్యార్థుల ప్రదర్శన ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుంది.

బాలిక అదృశ్యం

గచ్చిబౌలి: మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజాగూడలోని సహదేవ్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్ మేరి కూతురు(16)ఈ నెల 17న ఉదయం 10 గంటలకు తను పని చేసే అంజ ఎఫ్ స్టూడియోకు వెళుతున్నాని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో పని చేసే చోట, సమీప ప్రాంతాలలో వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం తల్లి మేరి రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హుక్కా పార్లర్ పై దాడి

గోల్కొండ: అక్రమంగా హుక్కా పార్లర్ నిర్వహిస్తున్న ఇద్దరిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాధాకిషన్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్ మెహిదీ కాలనీకి చెందిన సయ్యద్ బిలాల్ (22), సయ్యద్ అబ్దుల్ ఖాదర్ (26) సులువుగా డబ్బు సంపాదించడానికి మాసబ్‌ట్యాంక్ సిల్వర్ ఓ అపార్ట్‌మెంట్‌లో రెస్ట్ ఓ లాంజ్ కేఫ్ నిర్వహించారు. ఇందులో చట్టవిరుద్ధంగా హుక్కా పార్లర్ నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారంతో ఈనెల 17న రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇన్‌స్పెక్టర్ ఖలీల్ పాషా ఆధ్వర్యంలో ఈ హుక్కా పార్లర్ పై దాడి చేశారు. ఈ సందర్భంగా వారు స్వయంగా సోదరులైన సయ్యద్ బిలాల్, సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా వారి వద్ద నుంచి 27 హుక్కా పాట్స్, 53 స్మోకర్ కాయిల్స్ డబ్బాలు, హుక్కా ఫ్లేవర్ ప్యాకెట్లు 64, హుక్కా ఫ్లేవర్, ఒక కేజీ బాక్సులు 10, స్టాల్‌లు 4, 52 హుక్కా పైపులు, ప్లాస్టిక్ ఫిల్టర్స్ 25 పీసులు, అల్యూమినియం బాయిల్స్ 9 బాక్సులు, 2 వైర్‌లెస్ సెట్లు, 50 చిల్లం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 1.20 లక్షలు ఉంటుంది. కాగా తదుపరి విచారణ నిమిత్తం హుమాయున్ నగర్ పోలీసులకు అప్పగించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



వెంకటేశ్వరకాలనీలో సీసీ రోడ్ల పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: నియోజకవర్గం పరిధిలోని అన్ని మున్సిపాలిటీలలో ప్రజావసరాలను గుర్తించి వాటన్నింటినీ పూర్తి చేసినపుడే వారు మనల్ని గుర్తిస్తారని, అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టాలని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో రూ.2 కోట్లతో సీసీ రోడ్లు, ఫ్రెండ్స్ కాలనీలో రూ.50 లక్షలతో పార్కు అభివృద్ధి, చిత్రపురి కాలనీలో బస్తీ దవాఖానా, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో రూ. 30 లక్షలతో డ్రైవర్ కం ఓనర్ పద్ధతిలో కొనుగోలు చేసిన 15 చెత్త ఆటోలను మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పూర్తి చేయడంపైననే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నిధుల లభ్యతను బట్టి అన్ని కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, పార్కులు, మార్కెట్‌లు, తాగునీటి సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. ఇంకా కొన్ని కాలనీల్లో మిగిలి పోయిన పనులను రాబోయే రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. మున్సిపాలిటీలలో పెరుగుతున్న ప్రజలకు అనుగుణంగా సమస్యలు పెరుగుతున్నాయని, వాటిల్లో ప్రాధాన్యత క్రమంలో అన్ని పనులను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ సృజన, మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, మేనేజర్ బీఎన్‌కే రమేష్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయి మౌనిక, మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ, కౌన్సిలర్‌లు బి.పద్మారావు, కె.లక్ష్మీనారాయణ, బి. మీన ముత్యాలు, ఎస్. శ్వేత కిరణ్‌కుమార్, వి.హైమాంజలిఅనిల్‌కుమార్, వసంతరావు, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు బి. శ్రీరాములు, యాలాల నరేష్, రూపారెడ్డి, వెంకటేశ్వరకాలనీ అధ్యక్షుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గుడికి వెళ్లే దారిలో రోడ్డు కబ్జాను ఆపండి..

బండ్లగూడ: 50ఏళ్ల క్రితం కిస్మత్‌పూర్, దర్గా ఖలీజ్‌ఖాన్ ప్రాంతానికి చెందిన మల్లన్న గుడికి వెళ్లే 50 ఫీట్ల దారి కబ్జాకు గురవుతుందని స్థానికులు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఆలయానికి వెళ్లే దారిలో రోడ్డుపై గేటు ఏర్పాటు చేసిన భూ కబ్జాదారులపై తగు చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో మాలాకి రత్నం, జగదీష్, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, సురేష్, రాములు, బాబుయాదవ్ పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం..



రక్తదాన శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. లిమ్స్ ఆస్పత్రి ఐదో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలతో పాటు పేద ప్రజలకు తక్కువ ధరలకు మంచి వైద్యసేవలందిస్తుండడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ రామరాజు, ఎంపీపీ జయమ్మ, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నీరటి రాజు, కౌన్సిలర్ వై.కుమార్, సర్పంచ్ ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

చల్లా నరసింహారెడ్డికి సన్మానం



చల్లా నరసింహారెడ్డిని భారీ గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన చల్లా నరసింహారెడ్డిని రాజేంద్రనగర్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. గురువారం ఉదయం పీసీసీ ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, అత్తాపూర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ముద్దగౌని భాస్కర్ గౌడ్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు ధనుంజయ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చల్లా నరసింహారెడ్డి నివాసానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ బలమైన శక్తిగా ఎదుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు కొరని బాలరాజు, శంషాబాద్ మండల పార్టీ అధ్యక్షులు గడ్డం శేఖర్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు మైలారం సులోచన, సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షులు మహ్మద్ ఇస్మాయిల్, శాస్త్రిపురం డివిజన్ అధ్యక్షులు మహ్మద్ తాజుద్దీన్, బి-బ్లాక్ అధ్యక్షుడు మహ్మద్ ఖాలేద్, ఏ-బ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్‌కుమార్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ సమ్మేళనానికి తరలిన నేతలు



రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: బీజేపీ ఓబీసీ సమ్మేళనానికి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. గురువారం ఉదయం రాజేంద్రనగర్ అసెంబ్లీ ఓబీసీ బీజేపీ కన్వీనర్ బొమ్మరాజు నరసింహ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం డివిజన్ల నుంచి బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా నాగోల్‌కు తరలివెళ్లారు. సమ్మేళనం విజయవంతం చేసేందుకు మూడు, నాలుగు రోజులుగా పార్టీ స్థాయిలో బూత్‌స్థాయి నుంచి ఓబీసీ నాయకులు, కార్యకర్తలను సన్నద్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి ఓబీసీ సమ్మేళనానికి భారీ ఎత్తున తరలివెళ్లడం ఆనందంగా ఉందన్నారు. మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఓబీసీ ఇన్‌చార్జి కొమరయ్య, జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీధర్, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ ముదిరాజ్, అడిగే రాజు, సుల్గే వెంకటేశ్, రాజేంద్రనగర్ అధ్యక్షుడు మల్లేష్ చారి, జగన్, హరికిషన్, సిద్దేశ్వర్, బల్ల శ్రీనివాస్, మోహన్, జగన్, విజయ్, శ్రీరాం, వెంకటేశ్, నర్సింగ్‌రావు, సురేందర్, యాదయ్య, చిన్న, వివేక్, అంజి పాల్గొన్నారు.

‘శ్మశాన వాటిక పంచాయితీ బీజేపీకి ఆపాదించొద్దు’



మాట్లాడుతున్న పట్టణ ఓబీసీ మోర్చా కార్యదర్శి కుమార్

శంషాబాద్: రాళ్లగూడ శ్మశాన వాటిక విషయంలో ఇటీవల కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి చేసిన పర్యటనను అడ్డుపెట్టుకుని బీజేపీపై విమర్శలు చేయడం స్థానిక కౌన్సిలర్, బీఆర్ఎస్ నేతలకు తగదని ఓబీసీ మోర్చా పట్టణ కార్యదర్శి యమ్మ కుమార్ అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వ్యక్తిగత అంశాలతో స్థానిక ప్రజలను రెండు వర్గాలుగా విభజిస్తున్నారన్నారు. అభివృద్ధిపై దృష్టిసారించని నేతలే ఈ విధంగా వర్గవిభజనలకు పాల్పడుతున్నారన్నారు. బీజేపీ ఆపాదించే విధంగా వ్యవహరించడంతో పాటు పార్టీని విమర్శిస్తే సహించేది లేదన్నారు. వ్యక్తిగత పర్యటనలను వ్యక్తిగతంగానే పరిగణించాలే తప్ప పార్టీకి సంబంధం ఉండదన్నారు. తప్పులను కప్పిపుచ్చుకోకుండా అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు.

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం



రాజేంద్రనగర్: పాత వాహనాల స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పాత నగరానికి చెందిన ఓవైస్ శివరాంపల్లి ప్రాంతంలో స్క్రాప్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. వివిధ ప్రాంతాల నుంచి బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర పాత వాహనాలను తీసుకొని స్క్రాప్ చేసి విక్రయిస్తుంటాడు. గురువారం మధ్యాహ్నం దుకాణంలో ఓ బస్సును సిబ్బంది వెల్డింగ్‌తో వేరు చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. నిమిషాల వ్యవధిలో మంటలు స్క్రాప్ దుకాణం చుట్టూ వ్యాపించాయి. దీంతో సిబ్బంది బయటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటన స్థలికి చేరుకొని 2గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆందోళనకు గురైన స్థానికులు..

దట్టమైన పొగలతో అగ్ని ప్రమాదం జరగడంలో శివరాంపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మధ్యాహ్నం ఒక్కసారిగా పొగలు రావడంతో కలవరానికి గురయ్యారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో పక్కనే అపార్ట్‌మెంట్ ఉండటంతో పాటు బస్తీలు ఉన్నాయి. దీంతో పెద్ద ఎత్తున స్థానికులు చేరుకోవడంతో పోలీసులు సముదాయించి అక్కడి నుంచి పంపించారు.

నల్లాల్లో కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి



నల్లాలో వస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నల్లాలలో కలుషిత నీరు వస్తే జలమండలి అధికారులే దీనికి బాధ్యత వహించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకి, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండీ లైన్స్ తదితర బస్తీల్లో స్థానికులు ఆయనకు తమ సమస్యలను వినిపించారు. నల్లాలలో రంగు మారిన తాగునీరు వస్తుందని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని ఆయనకు ఫిర్యాదు చేశారు. నల్లా నీటిని కాచి వడబెట్టి తాగునీటిని తాగుతున్నా తమ ఆరోగ్యాలు దెబ్బతింటున్నదని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లాలో వస్తున్న నీటిని పరిశీలించారు. నల్లాలలో రంగు మారిన చెడు వాసనతో నీరు రావడం గమనించి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజల ఆరోగ్యం విషయం మీరేం పట్టించుకోరాని ఆయన ప్రశ్నించారు. ప్రజలు నీటి బిల్లులు కడుతున్నా కూడా నల్లాలలో కలుషితమైన నీరు రావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని ఆయన అన్నారు. వెంటనే సిబ్బందిని పంపి నల్లాలలో కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆయన ఎండీ లైన్స్-గోల్కొండ రోడ్డు తదితర ప్రాంతాలలో జరుగుతున్న డ్రైనేజీ రీమోడలింగ్ పనులను పరిశీలించారు.బల్దియా ఏఈతో పాటు మజ్లిస్ గోల్కొండ డివిజన్ నాయకుడు మహ్మద్ బదర్ ఉద్దీన్ తదితరులున్నారు.

ఓటరు జాబితా పరిశీలన



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అధికారి

గోల్కొండ: ఓటరు జాబితాలో నమోదైన పేర్లను బల్దియా అధికారులు ఇంటింటికీ తిరిగి వెరిఫికేషన్ చేస్తున్నారు. బల్దియా కమిషనర్ ఆదేశాలతో బల్దియా సిబ్బంది రెండు రోజులుగా ఓటరు జాబితా తీసుకుని ఇంటింటికీ తిరుగుతున్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు ఉన్న వారు ప్రస్తుతం అదే చిరునామాలో ఉన్నారా అనే విషయంతో పాటు ఫొటోలో విషయంపై కూడా విచారణ చేస్తున్నారు. మరోవైపు చిరునామా వారిని గుర్తించి వారి పేర్లను రాసుకుంటున్నారు. ఓటరు జాబితాలో పేర్లు లేనివారికి పేర్లు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. కార్వాన్ డివిజన్‌లో వెరిఫికేషన్ పనులు జోరుగా సాగుతున్నాయి.

గోల్కొండలో ట్రాఫిక్ పీఎస్ నిర్మాణ పనులు షురూ

గోల్కొండ: టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ గోల్కొండలో ఏర్పాటు కానుంది. ప్రస్తుతం టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సాలార్జంగ్ కాలనీలో పశ్చిమ మండలం ఆర్టీఏ కార్యాలయం లేన్‌లో అద్దె భవనంలో కొనసాగుతుంది. అయితే సొంత భవనాల్లోనే పోలీస్ స్టేషన్ కొనసాగాలన్న పోలీస్ శాఖ వారి నిర్ణయంతో ప్రస్తుతం ఉన్న టోలిచౌకి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను గోల్కొండకు తరలించాలనే నిర్ణయం జరిగింది. గోల్కొండ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లోని ఒక క్వార్టర్స్‌ను కూల్చివేసి ఆ ప్రదేశంలో నూతన భవనం నిర్మించడానికి అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో 3 రోజులుగా పాత భవనం కూల్చివేత పనులు జోరుగా సాగుతున్నాయి.



సన్మానం



జియాగూడ: కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ నూతన భవనంతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్లు అసంపూర్తిగా ఉండడంతో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా ప్రత్యేక నిధులు మంజూరు చేసి వాటి నిర్మాణం పూర్తి చేయడం హర్షణీయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఈ మేరకు గురువారం ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో శారదా విద్యామందిర్ విద్యార్థుల ప్రతిభ

శంషాబాద్: ఈ ఏడాది ప్రారంభంలో దేశవ్యాప్తంగా జరిగిన సైన్స్ ఒలింపియాడ్‌లో శారదా విద్యామందిర్ విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. గురువారం నగరంలోని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా ఫలితాలు విడుదల చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. శారదా విద్యామందిర్‌కు చెందిన మూడో తరగతి చదువుతున్న అభినవ్‌యాదవ్ జాతీయ స్థాయిలో పదో ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 5 ర్యాంకు, మూడో తరగతికి చెందిన ఆదిల్ జాతీయ స్థాయిలో 12 ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ దేవేందర్‌రెడ్డి అభినందించారు.

జీఓ 111పై కేబినెట్ నిర్ణయం హర్షణీయం

శంషాబాద్: తాజాగా జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశంలో జీఓ 111 ఎత్తివేతపై నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్ అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. జీఓ 111 కారణంగా మూడు దశాబ్దాలుగా 84 గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. అత్యవసరాల కోసం భూమిని విక్రయించుకోలేని దుస్థితి నెలకొందన్నారు. హెచ్ఎండీఏకు వర్తించే నిబంధనలన్ని కూడా జీఓ 111 పరిధిలోకి కూడా రానుండడంతో అభివృద్ధి శరవేగంగా జరిగేందుకు ఆస్కారం ఉందన్నారు. జీఓ 111 ఎత్తివేతకు కృషి చేసిన పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తికి జైలు

మణికొండ: అతిగా మద్యం తాగి కారు నడిపిన ఓ వ్యక్తికి ఉప్పర్‌పల్లి 3వ ప్రత్యేక కోర్టు రెండు రోజుల జైలు శిక్ష, రూ.5వేల జరిమానాను విధించింది. నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వీరేష్ అతిగా మద్యం తాగి కారు నడపగా ట్రాఫిక్ పోలీసుల తనిఖీలో పట్టుపడ్డాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా గురువారం శిక్షను ఖరారు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు చోట్ల ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహిస్తున్నామని, మద్యం తాగి వాహనాలను నడపొద్దని ఆయన సూచించారు.

12 మందికి జైలు శిక్ష..

రాజేంద్రనగర్: డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 26 మందిపై రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి గురువారం ఉప్పర్‌పల్లిలోని మూడవ స్పెషల్ ఎంఎం కోర్టు న్యాయమూర్తి నజరుద్దీన్ ముందు హాజరు పరిచారు. 26 మందిలో న్యాయమూర్తి 12 మందికి జైలు శిక్ష విధిస్తూ ఆదేశించారు. 8 మందికి మూడు రోజులు, ముగ్గురికి నాలుగు రోజులు, ఒకరికి ఐదు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు. మరోసారి పట్టుబడితే మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

‘ఏసీఎస్’లో హెచ్‌సీయూ పరిశోధనా పత్రం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధనా పత్రం అమెరికన్ జర్నల్‌లో ప్రచురితమైంది. అమెరికన్ కెమికల్ సొసైటీ (ఏసీఎస్) ప్రచురించిన మాలిక్యులర్ ఫార్మాస్యూటిక్స్ జర్నల్‌లో హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ అశ్వినికుమార్ నాంగియా, అతని పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ అసోసియేట్లు చైతన్య మన్నవ, అభిజిత్ రాయ్‌అ ఆధ్వర్యంలో ఔషధ కో క్రిస్టల్స్, లవణాలుగా తక్కువ ద్రావణీయత, తక్కువ ప్రాధాన్యత కలిగిన మందులలో ఔషధ ప్రక్రియను పెంపొందించడానికి కొత్త విధానాలను రూపొందించారు.

నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి కాటేదాన్ చౌరస్తాలో గురువారం ఉదయం సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎన్నో సంవత్సరాల తరబడి కలిసి మెలిసి ఉన్న ప్రజలపై కుల, మత ద్వేషాలు పెంచుతూ అజలడి సృష్టించేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. దేశ ప్రజల సంపదను బడా పెట్టుబడిదారులకు అమ్ముతూ దేశ ప్రజల సొత్తును తాకట్టు పెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, అధ్యక్షుడు రాజు, కోశాధికారి కవిత, ఉపాధ్యక్షులు రుద్రకుమార్, కిషన్, జిల్లా సహాయ కార్యదర్శి రామ్మోహన్‌రావు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే శివ హత్య

కుటుంబ సభ్యుల ఆరోపణ



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న శివ తండ్రి చంద్రయ్య, ముదిరాజ్ సంఘం నేతలు

శంషాబాద్: ప్రేమించిన యువతి దక్కలేదని ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్న సిద్ధాంతి శివది ముమ్మాటికి పథకం ప్రకారం చేసిన హత్యేనంటూ కుటుంబ సభ్యులతో పాటు ముదిరాజ్ సంఘం నేతలు ఆరోపించారు. ఈ మేరకు మృతుడు శివ ముదిరాజ్ తండ్రి చంద్రయ్యతో పాటు మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, కౌన్సిలర్లు అమృతారెడ్డి, మేకల వెంకటేష్ ముదిరాజ్, మల్లేష్‌ముదిరాజ్ తదితరులు గురువారం ఏసీపీ భాస్కర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి యువతి తండ్రి, బాబాయిపై ఫిర్యాదు చేశారు. శివ ఉరేసుకున్న విధానం కూడా తప్పుగా ఉందన్నారు. ఒంటిపై తీవ్ర గాయాలతో పాటు తలపై రంధ్రం ఉందని అతడిని తీవ్రంగా గాయపర్చి ఉరేసి ఆత్మహత్యంగా చిత్రీకరించారన్నారు. ఇటీవల ఇదే విషయమై జరిగిన పంచాయితీలో కూడా డబ్బులు ఖర్చుపెట్టినా అడ్డుతొలగిస్తామని కూడా హెచ్చరించారని పేర్కొన్నారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం వాస్తవాలు వెలుగుచూస్తాయని ఈ సందర్భంగా ఏసీపీ వారికి హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఖననం పూర్తి..

పోలీసులు ఇచ్చిన హామీ మేరకు శివ ముదిరాజ్ కుటుంబసభ్యులు గురువారం మధ్యాహ్నం అతడి ఖననం పూర్తి చేశారు. బుధవారం రాత్రి శవంతో బైఠాయించడంతో కొత్వాల్‌గూడలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే.

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి



ప్లకార్డ్స్ ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

బండ్లగూడ: సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పోలీస్ అకాడమీ చౌరస్తాలో ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గండిపేట మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిని అరెస్టు చేసి, మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం చారి, వెంకటేష్, అనిల్, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.